
# గొల్లపాతం సుబ్బరావు


చిన్నవోరి అబ్బా, సత్తిబాబూ క్లోజు ఫ్రెండ్సు. చెల్లూరు వంతెన మీద ప్రతిరాత్రీ ఒక గంటున్నా గడపనిదే ఇళ్ళ కెళ్ళరు వాళ్ళిద్దరూ.

కర్రి అమ్మిరెడ్డిగారి దగ్గర కూలికి



పాలసైకిలు తొక్కుతుంటాడు అబ్బు. ఇక నక్కలాగుండే సత్తిబాబుగాడి సంగతేంటంటే చెల్లూరు ఫ్యాక్టరీలో పనిచేసిన వాళ్ళనాన్న పోతా పోతా కాస్త సంపాయించిపోయేడు. ఆ డబ్బుతో జల్సా చేస్తుంటాడు.

ఒకరోజు చెల్లాయమ్మగారి మేడ ముందు నించెళ్తున్న సత్తిబాబుని ఆపిన బులిరెడ్డిమేస్టారు ''అలా జులాయిలాగ తిరక్కపోతే చెల్లూరు



ఫేక్టరీలోకెళ్ళి మీ నాన్న పని నీకిమ్మని అడగొచ్చుగదరా ఎదవా?'' అన్నాడు.

''లేదండి ఈ ఏడాదంతా ఏపనీ చెయ్యొద్దన్నారు మా గొల్లపాలెం గురువుగారు'' అన్నాడు సత్తిబాబు.

రాత్రి చెల్లూరు వంతెన మీద చిన్నవోరిఅబ్బు కల్సినప్పుడు పొద్దుట బులిరెడ్డిమేష్టారితో మాటాడింది చెప్పేడు సత్తిబాబు.

విన్నఅబ్బు ''నీకో విషయం చెప్పాలని వచ్చేను'' అన్నాడు.

ఏంటన్నాడు సత్తిబాబు.

''రాంపురంలో సంపరలక్ష్మీ తెల్సు గదా?''

''ఏదీ మగోళ్ళాగ పాలసైకిలు తొక్కుకుంటాపోద్ది అదే కదా చాలా పెంకి మనిషిసుమా''.

''అవును'' అంటా సత్తిబాబుకి దగ్గరగా జరిగిన అబ్బు ''ఆళ్ళ పెద్దమ్మాయి తారులాగ నల్లగా ఉన్నా భలే అందగత్తె, ఆ మనిషి పెద్ద పెద్ద కళ్ళు చూసి కళ్ళు తిరిగి పడిపోయే ననుకో...పేరు మంగభాను. తనంటే నాకిష్టం. నేనన్నా తన కిష్టమే. అన్నవరం వెళ్ళి పెళ్ళి చేసుకుందాం అన్నాను...ముందెళ్ళి మా అమ్మ నడుగు అంది'' అనాగేడు అబ్బు.

''అడిగేవా?'' అన్నాడు సత్తిబాబు.

''అడిగేను నీ దగ్గర పాత గోచీ పాతకూడా లేదు. నా పిల్ల నివ్వాలంటే నువ్వు సొంతంగా యాపారం చెయ్యాలి. నీ దగ్గర పాతికవేలన్నా రొక్కం ఉండాలి. అప్పుడుగానీ ఈ పక్కకి రాకు'' అంది.

''అయితే ఇప్పుడేవంటావ్?'' అన్నాడు సత్తిబాబు.

''అమ్మిరెడ్డిగారి దగ్గర కూలిపని మానేసి సొంతంగా పాలవ్యాపారం చేద్దామనుకుంటున్నాను...అయితే మన దగ్గర ఈడ్చి తన్నితే ఏగాణీ లేదు. పెట్టుబడికి నువ్వేమన్నా డబ్బు సర్దితే వడ్డీతో సహా తిరిగి కట్టేస్తాను'' అన్నాడు చిన్నవోరిఅబ్బు.

''ఏమాత్రమో?'' అన్నాడు సత్తిబాబు.

''సైకిలికీ కొత్త బిందెలకీ అయిదు వేలన్నా ఉండాలి గదా?'' అన్నాడు అబ్బు.

''ఆడబ్బు నేను సర్దుబాటు జేస్తానుగానీ  మా గొల్లపాలెం గురువుగారి దగ్గరికి పద. మంచిరోజు పెట్టించుకొందారి'' అన్నాడు సత్తిబాబు.

''మనం చేసేపని మనసు పూర్తిగా చేస్తే అందులోనే బోలెడు మంచుంటదంట. మీ గురువుగారి దగ్గరకి తర్వాత వెళదాంలే ముందా డబ్బు ఏర్పాటు చూడరా బాబూ'' అని సత్తిబాబు గెడ్డం పట్టుకున్నాడు అబ్బు.

* * *

కొత్త డైమండ్‌లైటు సైకిలుకి వెనకాల మడ్గమూడు కొత్త ఇత్తడిబిందెలూ, ముందు మూడు బిందెలూ కట్టుకుని హేండిల్ బారుకి లీటరు డొక్కూ, అరలీటరు డొక్కూ తగిలించి రాంపురం సైడు స్పీడుగా వెళ్తున్నాడు అబ్బు. అతని పక్కనే పిచ్చి తాతారెడ్డి అద్దిసైకిలు తొక్కుకుంటూ వస్తున్నాడు సత్తిబాబు.

''నీ మేలు మర్చిపోనురా సత్తిబాబూ! పెట్టుబడి పెట్టి టైముకి ఆదుకున్నావ్'' అన్నాడు.

''దాందే ముందిలేగానీ మా గురువుగారితో నేను ముహూర్తం పెట్టించిన టైముకి నువ్వు రామక్రిష్ణాహోటల్లో పాలు పోసెయ్యాలి'' అన్నాడు సత్తిబాబు.

అతనుచెప్పినట్టే చేసిన అబ్బు ఖాళీ బిందెల సైకిల్తో తిరిగొస్తుంటే పాలసైకిలు తొక్కుకుంటూ ఎదురైన సంపరలక్ష్మి చూసింది.

మాచవరం, చెల్లూర్లలో మోతుబరుల ఇళ్ళలో మాటాడుకున్న చిన్నమోరి అబ్బు తనే గేదెల దగ్గరకెళ్ళి పాలు పితుక్కోడం మొదలెట్టాడు. మాచవరం సత్తి భామిరెడ్డిగారింట్లో వరసలు కలిపి వాళ్ళ పొలంలో పండిన కూరగాయలూ, ఒణుక్కోడి పొదిగిన పిల్లలూ, జున్నుపాలూ ఇచ్చేవారు. కూరగాయలు ఉల్లిపాయల గంగిరెడ్డికీ, కోడిపిల్లలు మేడ చెల్లాయమ్మగారికి అమ్మేసేవాడు. జున్నుపాలయితే రామచంద్రపురంలో బార్కీసుపేట పక్క సందులో ఉండే డ్రామాయాక్టరు లక్ష్మికి అమ్మేవాడు.

చెల్లూళ్ళో కుంచాల చౌదరిగారింట్లో కొత్తాగా పాలు పితుక్కుంటుంటే సంకు రాత్రప్పుడు రామచంద్రపురం మంత్రవాదోళ్ళ కొట్లో వాళ్ళ పిల్లల్తో పాటు తనకీ కొన్నారు బట్టలు. వాళ్ళు వండుకున్న పండగ పప్పులన్నీ పెట్టేరు.

ఇటు పక్క చూస్తే రామకృష్ణా హొటేల్లోనూ, ఓల్గా హొటల్లోనూ పాలు పొయ్యడమే కాకండా పొయ్యిమీద అర్ధరాత్రి దాకా మరగ్గాచి ఇచ్చి వెళ్ళేవాడు. దాంతో ఆ హొటేలోళ్ళందరికీ సొంత మనిషైపోయాడు చిన్నమోరి అబ్బు.

పాల కొనుగోలు దార్ల దగ్గరా హొటేలోళ్ల దగ్గరా మంచి పరపతి సంపాయించుకుంటా రాత్రీ పగలనక బండ కష్టాలు పడి ఏడాది తిరిగేలోగా సత్తిబాబు దగ్గర తీసుకున్న అప్పు అణా పైసల్తో సహా తీర్చేయడమే గాకండా పాతిక వేలకి పై చిలుకు వెనకేసి సంపరలక్ష్మికి చూపించేడు.

దాంతో ''మరి ముహూర్తాలు ఎప్పుడు పెట్టుకుందారి అల్లుడుగారూ?'' అంది లక్ష్మి.

ఆ మాటకి చాలా సంబరపడిపోయిన చిన్నవోరి అబ్బు ''మీ యిష్టవండి మరి'' అనేశాడు.

ఆ రాత్రి చెల్లూరు వంతెన మీద సత్తిబాబుని కల్సినప్పుడు చెప్పేడు.

అంతా వినేసిన సత్తిబాబు ''నీకు చాలా మంచి జరుగుద్ది మా గొల్లపాలెం గురువుగారి దగ్గరకోసారి వెళ్ళోద్దారి అంటే ఎందుకు ఎగేస్తున్నావ్'' అన్నాడు.

''అంటే కొంచెం వెసులుబాటు చూసుకుని వెళదారని ఆగేను'' అన్నాడు అబ్బు.

''ఏడాదయినా ఇంకా వెసులుబాటవ్వలేదా? ..ఇదిగో నీ పెళ్ళి దగ్గర పడ్తంది గదా. ఈసారి ఊరుకోను. ఆ శుభకార్యానికి ముందు నువ్వు మా గురువుగార్ని కలవాల్సిందే. నీ పెళ్ళి ముహూర్తం గురువుగారు పెట్టాల్సిందే'' అన్నాడు.

''సర్లే'' అన్నాడు చిన్నమోరిఅబ్బు.

''సర్లేగాదు టైము జెప్పు మందారెడ్డిగారి మేనల్లుడు రామరాజుగారి చిన్నకారు కట్టించుకుని బయల్దేరదాం'' అన్నాడు సత్తిబాబు.

'నేను ఈ జాతకాల్ని నమ్మితే ఎప్పుడో వచ్చేసేవోడ్ని. నువ్వు జతగాడివి గాబట్టి. నాకెన్నో సాయాలు చేసేవుగాబట్టి నీ మాట కాదన్ను చెప్పు నువ్వెప్పుడంటే అప్పుడెళదాం''. అన్నాడు అబ్బు.

* * *

వెల్ల కాపవరం ఆర్యవటం దాటాక కాకినాడ వెళ్ళే దార్లో ఉందీ గొల్లపాలెం.

కాకినాడ టు అచ్చుతాపురం బస్సెక్కారు సత్తిబాబూ అబ్బూ.

గొల్లపాలెంలో వాళ్ళ వాడపిల్లి పెంకుటింటి ముందు జాతకం చూపించుకుందామని వచ్చిన జనం ముందు తడుంబాతతో స్నానం చేసి పూజా, పునస్కారం చివర్లో నమస్కారం అని చెప్పి ఇంకో గంట తర్వాత బయటికొచ్చేడు గురువుగారు.

వీభూదిపిండికట్లు పెట్టుకున్నాడు. సరిగ్గా శివుడు మూడోకన్ను ఉండే చోటులో ఎర్రటికుంకం బొట్టెట్టుకున్నాడు. రేటు బాగా ఎక్కువ పొందూరు ఖద్దరులాల్చీ, దానిమీద సగం చేతులకోటూ, కింద ప్లేటంచు పంచీ కట్టుకున్నాడు. మనిషిచూస్తే దబ్బపండు లాగున్నాడు.

ఏదీ ఓసారి నీ కుడిచెయ్యి ఇలాగియ్యి అంటాడని చూసేడు అబ్బు. కానీ అలాంటిదేం చెయ్యకుండా కాస్సేపు అబ్బు ముఖంలోకి జూసి ఇంకాస్సేపు కళ్ళు మూసుకుని ''ఒకసారి నువ్వు చావాల్సినోడివే ఆ అగ్నిగుండం తప్పి బయటపడ్డావ్ అప్పట్నించీ ఆ పని మానుకున్నావ్ అవునా?'' అడిగేడు గురువుగారు.

నడ్డి విరిగినట్టయ్యింది అబ్బుకి ఆ గురువుగారు చెప్పింది నిజమే. ఇంతకుముందు ఒక లైన్‌మేన్ దగ్గర అసిస్టెంటుగా రోజువారీ కూలికి చేసేడు. కర్రెంకయ్యగారి పొలంలో కరెంటుస్తంభం ఎక్కినప్పుడు కరెంటుషాకు కొట్టి కింద దమ్ము చేలో పడ్డాడు. అది సత్తిబాబుకి కూడా చెప్పలేదు. ఈయన గారికెలా తెల్సిందబ్బా అనుకుని ఉండిపోయేడలాగ.

''ఇప్పుడు నువ్వొకమ్మాయిని ఇష్టపడ్తన్నావ్. కానీ, ఏడాది క్రితం నిన్నోపిల్ల చాలా ఇష్టపడిందే'' అన్నాడు గురువుగారు.

అవును. చెల్లూళ్ళో కుంచాల చౌదరిగారి ఆఖరిచెల్లెలు వయసులో ఉండగా బిక్కవోలు ప్రాంతంలో ఉండే మొగుడు పోయేడు. పోలేదు..ఆ సైడు నక్కలోళ్ళు చంపేసేరంటారు. దాంతో పుట్టింటికి వచ్చేసిన ఆ అమ్మాయి ప్రతిరోజూ పాలు పోసేటప్పుడు తనని రెచ్చగొట్టేది చీర లోపల లంగా వేసుకునేదిగాదు. ఈ ముక్కకూడా తను సత్తిబాబుకి చెప్పలేదు మరి గురువుగారికెలా తెల్సింది చెప్మా అనుకుంటుండగా నాలుగురోజుల క్రితం ''నువ్వులారీ కిందపడి చావాల్సినోడివే రోడ్డు పక్క బోదీ కాలవలో పడ్డం వల్ల బతికిపోయేవు. అది నీ గొప్పతనం కాదు నీ కాబోయే భార్య అదృష్టం'' ఈసారి నడ్డితోపాటు చట్టకూడా విరిగినట్టయ్యింది నోటమాట పడిపోయింది. సెవరగంత దగ్గర నరాలు ఉబ్బిపోయినియ్యి. కాలూ చెయ్యీ ఆళ్ళేదు కాస్సేపు.

చాలా సేపు అలా ఉండిపోయిన అబ్బు ఈయనెవరో మామూలు మనిషికాదు అనుకున్నాడు.

''నేను రాంపురంలో సంపరలక్ష్మి పెద్దకూతుర్ని వచ్చేనెల్లో పెళ్లి చేసుకోవాలను కుంటున్నాను. మంచి చూసి పెడతారా?'' అన్నాడు.

''ఆ కార్యం శుభంగా జరగాలంటే నువ్వో ఆర్నెల్లు ఆగాలి'' అన్నాడు గురువుగారు.

''నీకో దోషముంది'' అన్నాడు గురువుగారు.

''దోషమేంటండీ బాబూ'' అర్థంగాలేదు అబ్బుకి.

''ఏంటంటే...కాకి ఎవరిపిండమో ముక్కున కరుచు వెళ్తన్నప్పుడు దాని ముక్కులోంచి జారిన కొన్ని మెతుకులు నీ నడినెత్తిమీద పడ్డాయి. దాంతో నీకు దోషం ఏర్పడింది. అంతేగాకుండా ఆ పిల్లకో కాలగండముంది ఆ ఆర్నెల్లలోపు మూడు పెద్ద పూజలు చెయ్యాలి. ఆ తర్వాతగానీ నువ్వా పిల్లని పెళ్ళి చేసుకోకూడదు... ఈ లోపు ఆ పిల్లకేసి చూడనుకూడా చూడకూడదు. ఈ గండం సంగతీ పూజలసంగతి పల్లెత్తు ముక్కగూడా ఆ పిల్లకి గానీ వాళ్ళ తాలూకు వాళ్ళకిగానీ చెప్పగూడదు'' అన్నాడు.

గురువుగారి మీద చాలా గురి ఏర్పడ్డ చిన్నమోరిఅబ్బు ''అలాగేనండి... ఇదాయకంగా చేస్తానండీ ఆ పూజలేంటో చెప్పండి'' అన్నాడు.

‘రెండు నెలలకో పూజ చొప్పున చేస్తే తప్ప ఫలించదు. అందుకే ఆర్నెల్లు టైము పెట్టేను. అయితే మా సత్తిబాబు ద్వారా వచ్చేవుగాబట్టి నేనేం తీసుకోను. పూజకి కావాల్సిన సామాన్లచీటీ రాసేస్తాను అవి కొనుక్కు రావటానికి మావాళ్లకి డబ్బియ్యి'' అన్నారు.

‘‘సరే ఇచ్చేస్తాను'' అన్నాడు చిన్నమోరిఅబ్బు.

మొదటిపూజకి తను దాచుకున్న పాతికవేల రొక్కంలో పదిహేనువేలు అయిపోయినియ్యి.

అటు పక్కనించి ముహుర్తం ఎప్పుడు పెట్టుకుందారల్లుడుగారూ అని కబురు చేస్తుంది సంపరలక్ష్మి.

‘‘చూద్దారి... చూద్దారి'' అంటున్నాడు చిన్నవోరిఅబ్బు.

‘మొన్నటిదాకా కుక్కపిల్లలాగా తిరిగినోడు ఇప్పుడేంటిలా అంటున్నాడు'' అనుకుంది లక్ష్మి.

రెండు నెలల తర్వాత రెండోపూజకి ఇంకో పదిహేనువేలన్నాడు గురువుగారు.

తన దగ్గర పదివేలు మాత్రమే ఉన్నాయి. ఇంకో అయిదువేలు కావాలంటే సత్తిబాబు సర్దేడు.

మళ్ళీ సంపరలక్ష్మి కబురు చేస్తే ‘‘సూద్దారి... సూద్దారి'' అన్నాడు.

దాంతో లక్ష్మి కేదో అనుమానమొచ్చింది. ఇదేదో కప్పదాటు యవ్వారం లాగుందే అనుకుని అదే ముక్క ఆ రాత్రి మంగభాను అన్నంలో పెరుగుబిళ్ళేసుకుంటున్నప్పుడు చెప్పింది.

విన్న మంగభాను ‘‘అవునమ్మా నన్నుకూడా కలవడం మానేసేడు'' అంది.

మూడో పూజకి పదిహేను కావాల్సొచ్చి సత్తిబాబు దగ్గర లేకపోతే సంపర్తమ్మ వాళ్ళత్తగారు నల్లకాంతమ్మ దగ్గర సైకిలూ, ఇత్తడిబిందెలూ తాకట్టు పెట్టి తెచ్చేడు.

మూడోసారి కబురు చేసిన సంపరలక్ష్మి ‘‘ఇదే ఆఖరిసారి నీ దగ్గర్నించి సిసలైన కబురుగానీ రాకపోతే మాపిల్లకి మారేడిమిల్లి సంబంధమొచ్చింది అది చేసేసుకుంటాం'' అంది.

దాన్నిక్కూడా ‘‘సూద్దారి సూద్దారి'' అన్నాడు.

మూడోదఫా పూజకూడా ఘనంగా జరిపించిన గొల్లపాలెం గురువుగారు చివర్లో మంగభాను పేర్న మరో నాలుగువారాలు శాంతులూ అయ్యీ జరిపించేరు.

సంపరలక్ష్మి కూతురు మంగభానుకి మారేడిమిల్లి సంబంధం చేసేసింది.

ఈ పూజల పుణ్యమా అని సంపరలక్ష్మికోసం దాచిన పాతికవేలూ పోయినియ్యి. నల్లకాంతమ్మకి కట్టలేక తాకట్టులో పాలసైకిలూ ఇత్తడిబిందెలూ పోయినియ్యి. సత్తిబాబుకి బోల్డు బకాయి పడిపోయున్నాడు. దాంతో సత్తుబేడకి కూడా మారకుండా పోయిన చిన్నమోరి అబ్బుకి ఇంకో దిక్కులేక తిరిగి కర్రి అమ్మిరెడ్డి దగ్గర కూలికి చేరిపోయేడు.

* * *